

# హాస్య వల్లరి



## నెలనెలా నవ్వుల పండుగ

**కామెడీ క్లబ్ కథలు** **మల్లాది వెంకట కృష్ణమూర్తి**

### పెళ్ళిచూపులు

ఓ వెర్రి వెంగళప్పకి పెళ్ళి చేసే ఉద్దేశంతో అన్ని జాగ్రత్తలూ చెప్పి పెళ్ళిచూపులకి తీసుకెళ్ళింది అతని తల్లి.

పెళ్ళిచూపులకి వెళ్ళగానే "ఈ అబ్బాయేనా పెళ్ళికొడుకు?" అడిగారు ఆడపిల్ల తరఫు వాళ్ళు. వెంటనే అందుకుని "నేనే పెళ్ళి కొడుకుని. ఈ చొక్కా మాత్రం నాది కాదు" అన్నాడు వెంగళప్ప నవ్వుతూ. వెంగళప్ప సంగతి బయటపడి సంబంధం కుదరలేదు.

"చొక్కా నీదికాకపోయినా ఆ సంగతి చెప్పకూడదు. అందరూ అది నీదే అనుకోవాలి" అని మందలించింది తల్లి.

మరోసారి ఇంకో సంబధం చూడడానికి తల్లితో వెళ్ళాడు వెంగళప్ప. అక్కడకూడా పెళ్ళికొడుకు సంగతి అడిగారెవరో.

"నేనే పెళ్ళికొడుకుని. చొక్కా కూడా నాదే అలాగే అనుకోవాలి మీరంతా.." అన్నాడు వెంగళప్ప.

ఈ సారి కూడా సంబంధం కుదరలేదు. "చొక్కా సంగతి చెప్పడమెందుకు?" అంటూ వెంగళప్పని కసిరింది తల్లి.

కొంతకాలానికి ఎలాగో కష్టపడి మరో సంబంధం కుదుర్చుకోడానికి వెళ్ళారు తల్లీకొడుకులు. "చొక్కా సంగతి మర్చిపో" అంటూ ముందుగానే బోధించింది తల్లి.

కానీ ఈసారి కూడ వెంగళప్ప బుద్ధిమారలేదు. "ఇతనే పెళ్ళికొడుకు" అని పిల్లకి పరిచయం చేస్తున్నారెవరో..

"అవును నేనే పెళ్ళికొడుకుని. నేను తొడుక్కున్న చొక్కా నాది అవునోకాదో నాకు తెలియదు. అయినా చొక్కా సంగతి మర్చిపోవాలి.." అన్నాడు..!!

## డాక్టర్..డాక్టర్..! యర్రంశెట్టి శాయి

డాక్టర్..డాక్టర్..

డాక్టర్: ఇరవై మూడో నెంబరు బెడ్ స్త్రీకి స్పృహవచ్చిందా?

నర్స్: ఇప్పుడే వచ్చింది డాక్టర్!

డాక్టర్: ఏం చేస్తోంది?

నర్స్: పాపం ఆ దెబ్బ తగిలిన చేతులతోనే మొఖానికి పౌడర్ రాసుకుంటోంది.

***

ఒక అర్ధరాత్రి డాక్టరు గారింట్లో ఫోన్ మోగసాగింది.

"హలో!" అన్నాడు డాక్టరు విసుగ్గా.

"డాక్టరు గారూ! త్వరగా రావాలి మీరు! మా అబ్బాయి చిన్న పెన్ను మింగేశాడు!" అందో గొంతు.

"ఇప్పుడు రావటం కుదరదు! ఉదయాన్నే వచ్చి చూస్తాలెండి.!"

"మరి అంతవరకూ ఏం చెయ్యమంటారు?" ఆదుర్దాగా అడిగిందా గొంతు.

"పెన్సిల్ తో రాసుకోండి.."

***

కుర్రడాక్టర్ తనను చూస్తేనే చాలు తెగ భయపడిపోతున్న రోగికి ధైర్యం చెప్పాలనుకున్నాడు.

"చూడండి! మీది పెద్ద ప్రమాదకరమైన వ్యాధేం కాదు.! అందాకా ఎందుకు..ఒకప్పుడు నాకూ వచ్చిందీ జబ్బు తెలుసా?" అన్నాడు తేలిగ్గా.

"అవుననుకోండీ..కానీ మీకు నయం చేసింది వేరే డాక్టరు కదా.." నసిగాడా రోగి.

***

"నమస్తే డాక్టరు గారూ! మీరు ఎంతో గొప్పగా వైద్యం చేసి నా లాంటివారికి సహాయపడుతున్నందుకు ధన్యవాదాలర్పించడానికి వచ్చాను.."

"కానీ..నేను మీకెప్పుడూ వైద్యం చేసిన గుర్తు లేదే."

"అది నిజమే కానీ, మా కోటీశ్వరుడు మావయ్యకి మీరు చేసిన వైద్యం మూలానే నేనింత త్వరగా లక్షలకు వారసుడినవగలిగాను."

***

తెల్లారుఝామున మూడింటికి డాక్టర్ గారింట్లో ఫోన్ మోగింది.

"హలో!" అన్నారు డాక్టరుగారు కళ్ళు నులుముకుంటూ.

"డాక్టరు గారూ! నేను శ్రీనివాసరావుని! మీరు అర్జంటుగా మందులన్నీ తీసుకుని మా ఇంటికి రావాలి!" అన్నాడు శ్రీనివాసరావు.

"ఎందుకు ఏమయిందీ?" ఆత్రుతగా అడిగాడు డాక్టరు.

"ఒకటే కలలండీ! పాడు కలలు! ప్రాణం తీసేస్తున్నాయి.."

"ఏం కలలొస్తున్నాయి..?"

"మరేమీ లేదు..త్రిష, శ్రియ, యిలియానా, స్నేహ, ముమాయత్ ఖాన్..- అందరూ కలలో కొచ్చి నన్ను కౌగలించుకుంటున్నారు!"

"ఓరినీ! అదృష్టమయ్యా అదృష్టం! హాయిగా ఆనందించక గొడవ చేస్తావెందుకు? పైగా అంత మంచి కలని పట్టుకుని పాడు కల అంటవా?"

"ఖచ్చితంగా అంటాను! లేకపోతే ఏమిటిసార్! కలలో నేనూ ఒక అమ్మాయినేనట!" అన్నాడు శ్రీనివాసరావు బాధగా.

***

"డాక్టర్ గారూ! వారం రోజుల క్రితం మా ఆయన వైద్యంకోసం మీ దగ్గరకొచ్చారు.! మీరేం మందిచ్చారో ఏమోగానీ నా సంసారమే సర్వనాశనమై పోయే పరిస్థితికొచ్చింది. ఇంతకుముందు నేనే అందరిలోకీ అందగత్తెననీ, నాకున్న గ్లామర్ మరేస్త్రీకీ లేదనీ అనేవారు. మీ దగ్గర వైద్యం చేయించుకున్న మర్నాటి నుంచీ నేను ఏమాత్రం అందంగా లేననీ, నేను తప్ప మిగతా స్త్రీలంతా ఎంతో అందంగా ఉన్నారనీ అంటున్నారు..."

"నేను చేసిందేమీ లేదమ్మా! కళ్ళు సరిగా కనబడకపోతే సరిపోయే కళ్ళజోడు కొనిపించానంతే.."

***

ఓ పెద్దమనిషి పిచ్చాసుపత్రిలోని డాక్టరు దగ్గరకొచ్చాడు.

"ఏమిటి విషయం?" అడిగాడు డాక్టరు.

"ఓ సారి మానసిక వైద్యుడి దగ్గర చూపించుకురమ్మని మా ఆవిడ పోరేస్తుంటే బాధపడలేక వచ్చాను.!" అన్నాడు పెద్దమనిషి.

"ఆవిడెందుకలా పోరేస్తోంది?" శ్చర్యంగా అడిగాడు డాక్టరు.

"నాకు బూట్లంటే చాలా ఇష్టం అదే దానిక్కోపం.." అన్నాడా పెద్దమనిషి.

"దానిదేముంది! బూట్లు చాలామందికి ఇష్టమే. అందాకా ఎందుకూ నాక్కూడా బూట్లంటే ఇష్టమే! నాలుగు జతలు కొనుక్కున్నాను మొన్ననే.." అన్నాడు డాక్టరు.

"అరె! మీక్కూడా ఇష్టమేనా! ఆశ్చర్యంగా ఉందే! అయితే వాటిని మీరు ఎలా తింటారు? ఉడకబెట్టా? వేయించుకునా?" అడిగాడా పెద్దమనిషి.

***

"నాకు జరగబోయే ఆపరేషన్ ప్రమాదకరమయిందంటారా?" ఆపరేషన్ టేబుల్ మీద పడుకుని అడిగాడు రామారావు.

"పిచ్చి వాడా!" నవ్వాడా డాక్టర్.." మీరిచ్చే మూడొందలకి ప్రమాదకరమైంది కాదుగదా, మామూలు ఆపరేషన్లు కూడా ఎవ్వరూ చేయరోయ్.."

***

# చౌ చౌ

"ఏరా! నాగురించి అన్నీ అబద్ధాలు చెబుతున్నావంట అందరికీ..అలా ఉన్నవీ లేనివీ కల్పించి చెప్పడం మానేస్తే..నీకో సాయం చేస్తాను.."

"ఏమిటదీ..?"

"నీ గురించి నిజాలు చెప్పడం మానేస్తాను.."

***

"జాంబవతీ.. ఈ విషయం విన్నావా? ఈ విదేశీ పత్రికలో ఒక వ్యాసం వచ్చింది. మగవాడు ఎంత మూర్ఖుడైతే అతనికి అంత అందమైన భార్య దొరుకుతుందట.."

"అవును నిజమే సుమా..చిన్నప్పటి నుంచీ అందరూ నన్ను అందగత్తెనని పొగుడుతుంటారు..!"

***

"నాపెళ్ళయ్యాక ఒకే ఒక్కసారి మా ఆవిడ నా మాట విందిరా"

"ఓ..అలానా? ఎప్పుడూ?"

" ఆ మధ్య భూకంపం వచ్చినప్పుడు..ఏమేవ్ బయటికొచ్చేయ్..అని అరిచా.అంతే ఠక్కున బయటికొచ్చేసింది.."

***

"పాడటం వలన రక్తం వేడెక్కుతుందని శాస్త్రజ్ఞులు చెబుతున్నారు తెలుసా మీకు..?"

"అవును నిజమే.. మీరలా వేదికమీద మైకు వదలకుండా పాడుతుంటే..వింటున్న మా రక్తం వేడెక్కుతూ ఉంటుంది..."

***

"అవునూ...గత వారంరోజుల నుంచీ మీవారితోటే మొక్కలకి నీళ్ళు పట్టిస్తున్నావంట.. ఏమి టెక్నిక్ వాడావోయ్.."

"ఏం లేదు..ఒక్కటే మాట అన్నాను.. తోటలో మొక్కలకి కూడా నీళ్ళు పెట్టలేనంత ముసలితనం వచ్చేసిందా? అన్నానంతే..!"

***



"ఎందుకు జంబులింగం..అలా విచారంగా వున్నావ్.."

"మా ఆవిడ ఉద్యోగం వెదుకుతోంది.."

"దానికి నీకెందుకు విచారం?"

"ఆవిడ ఉద్యోగం వెదికేది నాకోసమే.."

***

జంబులింగం హెల్మెట్ లేకుండా స్కూటర్ మీద వెళ్తుంటే ట్రాఫిక్ పోలీస్ ఆపాడు..

"ఏయ్..మిస్టర్..మీరు హెల్మెట్ పెట్టుకోలేదు..స్కూటర్ కి హెడ్ లైట్లు కూడా లేవు.."

"లైట్లెందుకు..నాకు చూపు బాగానే ఆనుతుంది.."

"అసలు లైసెన్స్ ఉందా?"

"లైసెన్సా..ఎందుకు..నేనెప్పుడు తీసుకోలేదు.."

"స్టేషన్ కి నడవండి.."

వెంటనే మిసెస్ జంబులింగం జాంబవతి కలగచేసుకుని..

"దయచేసి మీకు పుణ్యం ఉంటుంది..ఆయన్ని వదిలేయండి ఇన్స్పెక్టర్ గారూ..తాగి నప్పుడు ఏం మాట్లాడతారో..వారికే తెలీదు.." అంది.

***

జంబులింగం, జాంబవతి వాళ్ళబ్బాయి సోమలింగం పుట్టినరోజుకని స్నేహితుల్ని ఇంటికి పిలిచారు. జంబులింగం ఇంట్లో సామాన్లన్నీ సర్దుతూ డ్రాయింగ్ రూమ్ లో ఉన్న కొన్ని పుస్తకాలూ, అలంకరణ సామాగ్రి తీసేసి లోపల ఎక్కడో పెట్టేస్తుంటే జాంబవతి అడిగింది.."ఏమండి..అవన్నీ ఉంటే డ్రాయింగ్ రూమ్ అందంగా ఉంటుంది కదా.. ఎందుకలా లోపల పెట్టేస్తారు.." అని అడిగింది.

" పిచ్చి మొహమా.. ఎవరి వస్తువులు వాళ్ళు గుర్తు పట్టేయ్యరూ.."

***

"ఏమండీ..ఇందాక టి.వి9 లో ఒక కొత్త వార్త చెప్పారు తెలుసా?"

"ఏమిటది?"



"చాలా ప్రమాదాలు వంటింట్లోనే జరుగుతాయట,,"

"అవును నిజమే వాటిల్లో కొన్నింటిని మేము తినాల్సి వస్తుంది కూడా.."

***

"మీవారు రీసెర్చి స్కాలరంట కదా..అంటే ఎప్పుడూ ఏదో ఒకటి వెదుకుతూనే ఉంటారన్న మాట..అయినా ఎప్పుడూ అన్వేషించడానికి ఏముంటుందండీ?"

"ఎందుకుండదూ.. ఆయన కళ్ళజోడే ఉదాహరణ.. రోజులో చాలా భాగం దాన్ని అన్వేషించడంలోనే సరిపోతుంది.."

***

"జంబులింగం గారూ.. అన్యోన్య దాంపత్యానికి కొన్ని సూత్రాలు చెబుతారా?"

"కొన్ని ఎందుకు నాయనా..ఒక్కటి చాలు.."

"ఏమిటది.."

"మీ ఆవిడ అనుకున్న దార్లో ఆవిడని వెళ్ళనీ.. నువ్వూ ఆవిడ దార్లోనే వెళ్ళిపో.."

***



"కష్టపడి పనిచేయడం కాదురా స్మార్ట్గా పనిచేయడం నేర్చుకోవాలి.."

"అలాగా?"

"అవును మరి..నన్ను చూడు..ఈ హోటల్లో కాషియర్గా చేరిన సంవత్సరానికే ఈ హోటల్ని కొనేశాను.."

"నాకలా కుదరదోయ్.. మా ఓనర్ ఎప్పుడూ కాష్ కౌంటర్ దగ్గరే నిలుచుంటాడు..!" ***